# సారీ..మైడియర్!

-ఎం.గాంధీ

"ఏవండీ...సెవన్ అవుతోంది-లేచి రెడీ అవండి..బబ్లూను స్కూలు బస్సు దగ్గర దింపివద్దురు'' అంది ఆనంద్ భార్య వసుంధర.

ఆనంద్ మగతగా నిద్రలేచి "వసూ! ఇంకా సేపు పడుకుంటాను. ఈ రోజు నువ్వే వదిలిపెట్టి రావా ప్లీజ్'' అన్నాడు.

"నేనింకా స్నానం కూడా చేయలేదు. రోజూ లాగే ఈరోజూ కాస్త ఓపిక చేసుకుని దిగబెట్టి రండి'' అని టీపాయ్ మీదున్న రిమోట్ కంట్రోల్ తీసుకుని టీవి ఆన్ చేసింది.



భార్య మనస్తత్వం తెల్సిన ఆనంద్ ఇక తప్పదన్నట్టు లేచి వాష్ బేసిన్‌లో మొహం కడుక్కుని ఐదేళ్ళ బబ్లూని తీసుకుని బయల్దేరాడు.

ఆనంద్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. రోజు సాయంత్రం మూడింటికెళ్ళి రాత్రి ఏ రెండింటికో ఇంటికొస్తాడు.

వచ్చి నిద్రపోయేసరికి మూడు కూడా దాటిపోతుంది. ఆనంద్‌కు ఒక్కసారి నిద్రలేస్తే మళ్ళీ ఎంత గింజుకున్నా నిద్రరాదు. అంతే కాదు...మధ్యాహ్నం నిద్రపోయే అలవాటు కూడా లేదు తనకి. దాంతో ఆనంద్‌కు సరైన నిద్ర లేకపోవడంతో రోజంతా అనీజీగా వుంటోంది.

వసుంధర రోజంతా టీవీకి అతుక్కుపోయి వుంటుంది. పైగా తను చేసే చిన్న పనిని కూడా భర్త గుర్తించాలని ఆరాటపడిపోతూ వుంటుంది.

బబ్లూని రోజూ స్కూల్ బస్సు దగ్గర వసుంధరే దిగబెట్టి రావచ్చు. ఆ బస్టాప్ కూడా ఓ ఫర్లాంగ్ దూరమే వుంటుంది.

ఎలాగైనా బబ్లూని బస్సు దగ్గర దింపే పనిని వసుంధర చేత చేయించాలని నిర్ణయించుకున్నాడు ఆనంద్. లేకపోతే తనకి సరైన నిద్ర ఉండదన్న ఆలోచనలతో ఆఫీసుకు బయలుదేరాడు ఆనంద్.

***

మరుసటి రోజు బబ్లూని బస్సు దగ్గర దిగబెట్టి ఆనంద్ కాస్త ఆలస్యంగా ఇంటికొచ్చాడు.

"ఏంటీ ఆలస్యం..బస్సు లేటుగా వచ్చిందా?'' అంది టీవీలో ఏదో ప్రోగ్రాం చూస్తూ వసుంధర.

"లేదు! నా క్లాస్‌మేట్ కల్పన అనే అమ్మాయి వాళ్ళ ఆయనకు ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ అయిందట. మన కాలనీలోనే ఉంటున్నారు. వాళ్ళ అమ్మాయి కూడా మన బబ్లూగాడి స్కూలేనట. వాళ్ళ అమ్మాయిని బస్సు దగ్గర దింపడానికి వచ్చింది. చాలారోజుల తర్వాత కలిశాంగా..కాసేపు మాట్లాడి వచ్చేసరికి ఆలస్యమైంది'' బ్రహ్మాస్త్రం లాంటి అబద్ధం చెప్పి కాజువల్‌గా పేపర్ తిరగేస్తూ వసుంధర మొహంలోని ఫీలింగ్స్ క్రీగంట అబ్జర్వ్ చేశాడు.

ఆమె మొహంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి ఆడవాళ్ళల్లో పిసరంతైనా అనుమానం ఉంటుంది. కానీ వసుంధర విషయంలో మాత్రం అనుమానం పుష్కలంగా ఉంది.

టీవీలో చూస్తున్న ప్రోగ్రాం మీద ఏకాగ్రత లేదు, ఏదో ఆలోచిస్తోంది. కాదు..కల్పన వర్సెస్ ఆనంద్ గురించి ఆలోచిస్తుంది.

'వీళ్లిద్దర్నీ ఇలా గంటలు గంటలు మాట్లాకోనివ్వడం నా సంసారానికి ఏమంత మంచిది కాదు' తనలో తను అనుకుంది వసుంధర.

మరుసటి రోజు ఏడుగంటలైనా ఆనంద్‌ని నిద్రలేపలేదు వసుంధర.

బబ్లూని వసుంధరే స్కూల్ బస్సు ఎక్కించింది. ఇదంతా ఆనంద్ గమనించినా కూడా ఏమీ ఎరగనట్టు పడుకుని నిద్రపోతున్నట్టు నటించాడు.

ప్రతి దానికి అనుమానించే తన భార్య దగ్గర ఒక చిన్న అబద్ధం మంచి ప్రభావం చూపించింది. ఇప్పుడు తను బజారు పనులు చూసుకుని, తీరిగ్గా ఆఫీసుకి వెళ్ళొచ్చు. లేదంటే రోజూ ఆఫీసుకి లేటయ్యి, బాస్ చేత చివాట్లు తినాల్సి వస్తోంది.

వెళుతున్న భార్యను చూస్తూ 'సారీ..మైడియర్!' స్వగతంగా అనుకున్నాడు ఆనంద్.

★